# ఐదు నెలల్లో ఎంతపనైపాయె!



సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మార్డి గ్రామంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

## వడ్ల తూకంలో జాప్యంపై రోడ్డెక్కిన రైతులు

- చిన్నరైతుల వడ్లు తూకం వేస్తలే
- పెద్ద రైతులవి మాత్రమే వేస్తుండ్రు
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇట్లలేకుండె
- నిర్వాహకుల తీరుపై మండిపాటు

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి రోజులు గడుస్తున్నా తూకం చేయడం లేదని ఆరోపిస్తూ రైతులు రోడ్డెక్కారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మార్డి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో 15 రోజులుగా వరి కుప్పలు పోశామని రైతులు తెలిపారు. తీసుకువచ్చిన వడ్లను క్రమపద్ధతిలో తూకం చేయకుండా చిన్న రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓ ఇద్దరు నాయకులు ఐకేపీ సీసీకి ఫోన్ చేసి ఫలానా పెద్ద రైతు అని చెప్పగానే వారివే తూకం వేస్తున్నారని మండిపడ్డారు. నాలుగైదు రోజులకు ఓ లారీ వస్తుందని, తొందరగా వడ్లు తరలించడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పద్ధతి ప్రకారం కొనుగోళ్లు జరిగాయని పేర్కొన్నారు. ధాన్యం కేంద్రంలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. – కల్హేర్, మే 11

## 8 క్వింటాళ్ల జొన్నలే కొంటున్నరు

- బీఆర్ఎస్ పాలనలో ఈ నిబంధన చూడలేదు
- ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఎదుట రైతు ఆవేదన

ఆదిలాబాద్, మే 11(నమస్తే తెలంగాణ): 'నేను యాసంగిలో నా రెండున్నర ఎకరాల పొలంలో జొన్న పంట సాగు చేసిన. కరెంటు కోతలు, సాగు నీటి సమస్యలను తట్టుకుని పండించిన. 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వాటిని అమ్ముదామంటే.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరాకు 8 క్వింటాళ్లు మాత్రమే కొంటామని అధికారులు చెప్తున్నారు. ఎకరాకు 8 క్వింటాళ్లు కొంటామనడం ఎక్కడి నిబంధన? ఇప్పటి వరకు 20 క్వింటాళ్లు అమ్మిన. మిగిలిన పంట ఇంటి దగ్గరే ఉంది. ఇప్పుడు వాటిని నేను ఏం చేయాలి? బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి నిబంధనలు ఎన్నడూ చూడలేదు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొన్నారు' అంటూ ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని కప్పర్లకు చెందిన రైతు గంద్రత్ భగవాండ్లు.. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ ఇంటికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు.



ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం కప్పర్లలో ఎన్నికల ప్రచారానికొచ్చిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో జొన్నలు కొంటలేరని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు గంద్రత్ భగవాండ్లు

అలాగే.. తలమడుగు మండలం లింగిలో మహిళా రైతు రాజ్యలక్ష్మి తమ జొన్న పంట అకాల వర్షానికి తడిసిపోయిందని, తడిసిన పంటను అధికారులు కొంటలేరని తెలిపింది. జొన్నల కొనుగోళ్ల సమస్యపై అధికారులతో చర్చిస్తామని, పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోతే రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని ఎమ్మెల్యే అనిల్ రైతులకు హామీ ఇచ్చారు.

# రైతుల నుంచి 15 వేల కోట్లు లూటీ!

## ఇక నుంచి కోటి ఎకరాలకు రైతుబంధు ఎగనామం!

- రైతుభరోసాకు కొత్త రూల్స్ పేరుతో కాంగ్రెస్ టోకరా
- అదే జరిగితే రైతులకు ప్రైవేట్ అప్పులే దిక్కు
- ఇక వ్యవసాయ సీజన్ ఆరంభంలో కాకుండా పంటల కోతల సమయంలో రైతుబంధు జమ!
- మళ్లీ విజృంభించనున్న వడ్డీ వ్యాపారులు
- ప్రభుత్వం అందించబోయే సాయం వడ్డీలకే సరి
- ప్రభుత్వం తెస్తున్న కొత్త నిబంధనలతో జరిగేది ఇదే
- రైతులను బలిపీఠం ఎక్కించనున్న కాంగ్రెస్ విధానాలు

**రైతుబంధు నిబంధనల్లో మార్పులు చేయడం ద్వారా ప్రతి ఏటా రైతులకు దక్కాల్సిన దాదాపు రూ.15 వేల కోట్లకు ఎగనామం పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతున్నది! 'సాగు చేసిన పంటకే రైతుబంధు ఇస్తాం' అనే నిబంధన పెట్టి, ఇంత పెద్ద మొత్తంలో రైతుల జేబులకు చిల్లు పెట్టబోతున్నది. అంతేకాదు, వ్యవసాయ సీజన్ ఆరంభంలో అందించాల్సిన పెట్టుబడి సాయాన్ని సాగు లెక్కలు తీసే పేరుతో నెలల తరబడి ఆలస్యం చేసి, వారిని వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలివేయబోతున్నది. అప్పుల విష వలయంలోకి నెట్టబోతున్నది. ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు చేస్తున్న వ్యాఖ్యల లోగుట్టు ఇదే.**

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధుతో ఇన్నేళ్లపాటు పెట్టుబడికి రంది లేకుండా, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేయకుండా పంటలు సాగు చేసుకున్న రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ అప్పుల తిప్పలు తప్పేలా లేవు. ఎందుకంటే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అప్పుల ఊబిలోకి నెట్టే విధానాలకు తెరలేపింది. రైతుబంధు పథకానికి కోతలేసి, ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న రైతుల బతుకులను ఆగమాగం చేసేందుకు సిద్ధమవుతున్నది. రైతుబంధు నిబంధనల్లో మార్పులు చేస్తామని, ఇక రైతులందరికీ ఇచ్చేది లేదని, సాగు చేసిన భూమికి మాత్రమే ఇస్తామని, దానికీ పరిమితి విధిస్తామని కాంగ్రెస్ నేతలు తెగేసి చెప్తున్నారు. ఒకవైపు రైతుబంధుకు కోతలేస్తూ, మరోవైపు ఆలస్యంగా పెట్టుబడి సాయం ఇస్తుండటంతో రైతులు మళ్లీ ప్రైవేట్ అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంటున్నది.

### ఇక పంట కోతల తర్వాతే రైతుబంధు!

వ్యవసాయ శాఖ రైతుబంధులో మార్పులపై కసరత్తు మొదలుపెట్టింది. ఇకపై రైతులందరికీ, మొత్తం భూమికి రైతుబంధు ఇవ్వకూడదని, పంట సాగు చేసిన భూమికి మాత్రమే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. దీంతో పంట సాగు లెక్కలు తేలిన తర్వాత మాత్రమే రైతులకు పెట్టుబడి సాయం అందుతుంది. పంటలు వేసిన భూముల లెక్కలు తీసి, వాటిని అధికారులు ప్రభుత్వానికి సమర్పించి, రైతుల ఖాతాల్లో జమ చేసేలోగా పుణ్యకాలం కాస్త గడిచిపోయింది. వ్యవసాయ సీజన్ ఆరంభంలో అందాల్సిన పెట్టుబడి సాయం పంటల కోతలు ముగిసే సమయానికి కాని అందదు. దీంతో రైతులు పంట పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి సీజన్‌లో రైతుల ఖాతాల్లో సుమారు రూ.7,500 కోట్లు జమ చేసింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ సీజన్ ఆరంభంలో కాకుండా పంట కోతల సమయంలో రైతుబంధు ఇస్తే, రైతులు ఆ మేరకు అంటే దాదాపు రూ.7,500 కోట్ల అప్పు చేయకతప్పదు. దీంతో మళ్లీ గ్రామాల్లో షావుకార్లు, వడ్డీ వ్యాపారులు చెలరేగిపోతారు. బారువడ్డీలు, చక్రవడ్డీల పేరుతో రైతులను పీల్చిపిప్పి చేసిన పాత రోజులు మళ్లీ వస్తాయి. దీంతో రైతుల రెక్కల కష్టం వడ్డీలకు కూడా సరిపోని దుస్థితి వస్తుంది. తద్వారా రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉన్నది. అంతేకాకుండా, రైతులు తాము పండించిన పంట మొత్తం తమకు అప్పులు ఇచ్చిన షావుకార్లు, వడ్డీ వ్యాపారులకు అడ్డికి పావుశేరుకే అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురిస్తుంది. ఒక్క రైతుబంధు పథకంలో మార్పుల వల్ల రైతుల బతుకులు అనేక విధాలుగా ఆగమాగం కానున్నాయి.



### రైతులకు అప్పుల తిప్పలు తప్పించిన కేసీఆర్

రైతుబంధు పథకాన్ని కేసీఆర్ ఆషామాషీగా అమలు చేయలేదు. ఉద్యమ నేతగా, సుదీర్ఘ అనుభవంగల రాజకీయ నేతగా ఆయన క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలు, పంట పెట్టుబడి కోసం పడుతున్న బాధలు, వడ్డీ వ్యాపారుల అరాచకాలు, వేధింపులను గమనించారు. అందుకే ప్రత్యేక రాష్ట్రం వచ్చాక దేశంలో, ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. ఇది అప్పుడు దేశంలో, ప్రపంచంలో ఒక సంచలనం. కేసీఆర్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వంతోపాటు అనేక రాష్ట్రాలు అనుసరించాయి. కేసీఆర్ ఈ పథకాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా అమలుచేశారు. రైతు రైతే.. చిన్న రైతా, పెద్ద రైతా అనే తేడా లేదు. ఏ రైతు అయినా సరే పంట పండించాలంటే పెట్టుబడి పెట్టాల్సిందే. అందుకే ఆయన ఈ పథకాన్ని అందరికీ వర్తింపజేశారు. ఏటా ఎకరాకు రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించారు. ఇది తెలంగాణ వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకొచ్చింది. రైతులకు ఆర్థిక భరోసా కల్పించింది. వారు సొంత కాళ్లపై నిలబడేలా చేసింది. ఈ పథకం ద్వారా కేసీఆర్ రైతులకు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన తిప్పలను తప్పించారు. వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి మోక్షం కలిగించారు. అందుకే ఎప్పుడూ కేసీఆర్ ఒక మాట చెప్తుంటారు.. 'కేసీఆర్ బతికి ఉన్నంత వరకు రైతుబంధు ఆగదు. కోతలు పెట్టబోను' అని. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం ఆ మాటకు కట్టుబడి ఉన్నారు. ఏ ఒక్క రైతూ రైతుబంధు కోసం అధికారులకు లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా, రైతులను పీడించే ఏ చిన్న అవకాశం కూడా అధికారులకు ఇవ్వకుండా పకడ్బందీగా అమలు చేశారు. ఎంతో గొప్ప ఆశయంతో, రైతుల అప్పుల బాధలను తప్పించాలనే సంకల్పంతో కేసీఆర్ అమలుచేసిన ఈ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో తూట్లు పొడుస్తున్నది. దీనికి రాజకీయ రంగు పులిమి రైతులను మళ్లీ బలిపీఠంపై ఎక్కించే ప్రయత్నం చేస్తున్నది.

### రైతులపై మోయలేని భారం

రైతుబంధులో మార్పులు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు రైతులపై భారీ మొత్తంలో ఆర్థిక భారాన్ని మోపనున్నది. ఏటా వానకాలం, యాసంగి సీజన్లకు కలిపి సుమారు కోటి ఎకరాలకుపైగా భూమికి రైతుబంధును ఎగ్గొట్టేందుకు వ్యూహరచన చేస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎకరాకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ లెక్కన ఒక్కొక్క ఎకరాకు రూ.15 వేల చొప్పున కోటి ఎకరాలకు రూ.15 వేల కోట్లు ఎగ్గొట్టనున్నది. అంటే ఆ మేరకు రైతుల ఆదాయానికి ఒక్క కలం పోటుతో చిల్లు పెట్టనున్నది. వారికి దక్కాల్సిన పెట్టుబడి సాయాన్ని లూటీ చేయనున్నది. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ సంకుచిత, అనాలోచిత నిర్ణయాల కారణంగా జరగబోతున్న నష్టం.



### పిల్ల పెరిగినంక కుల్లగుట్టినట్టుంది

పిల్ల పుట్టక ముందే కుల్లగుట్టినట్టుంది అనేది ఎనుకటి సామెత.. ఎవరైనా పనిగాక ముందే తొందరపడితే దీనిని ఇమ్మడించేది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ ముచ్చట అందుకు ఉల్టా ఉంది. పిల్లపుట్టి పెరిగి పెద్దదైనంక కుల్ల గుట్టినట్టుగా ఉంది ఆయన ఇగురం. తెలంగాణ వచ్చినంక రైతులకు బలం ఇచ్చేందుకు కేసీఆర్ సార్ పొద్దంతా కరెంట్ ఇచ్చిండు. చెర్లు బాగు చేసిండు. పంప్‌హౌస్‌లు కట్టి వరద కాలువను నింపి యాడాది పొడువునా నీళ్లు ఉండెటట్టు చేసిండు. దీంతో జగిత్యాల జిల్లాలో ఉన్న అన్ని ఊళ్లకు బలిమైంది.. రైతుబంధు పెట్టి ఆయుటి పూనంగనే ఎకరాన ముందు నాలుగువేలు, అటెన్క ఐదువేలు ఏసిండు.. నాకు రెండెకరాల ఆరుగుంటల భూమి ఉంది. పదివేలు పడేవి. ఆయుటి పూనంగ, యాసంగి మొదలు కాంగనే పైసలు పడేతోటే ఎవుసం పనులకు అక్కెరకు వచ్చినయి. అడుగుమందుకు, ఇత్తునంకు, ట్రాక్టర్ దున్నెందుకు ఆ పైసలు అచ్చినయి. ఇప్పుడు రేవంతం సార్ పొలమేసి, కోసి, అడ్లు అమ్ముకున్నంక రైతుబంధు పైసలు ఇత్తున్నా అంటుండు. ఇప్పుడెందుకు రైతుబంధు పైసలు. ఇది పోగువోశె ముచ్చట లెక్క లేదు. రైతుకు పైసలు మొగులు మెత్తవడేటప్పుడు ఇయ్యాలె, లేకుంటే ఇత్తునం పెట్టె ముందన్న ఇయ్యాలె. ఈ సర్కార్ లెక్కసూత్తె రైతుకు లాభం అయ్యేటట్టు కనిపిత్త లేదు. మళ్ల కేసీఆర్ అత్తెనే రైతుకు లాభమయితది. ఆయన అచ్చేదాక రైతులకు తిప్పలు తప్పవు.

– గొట్టం నారాయణ, రైతు, రాంపూర్, మల్యాల మండలం, జగిత్యాల జిల్లా



### సాగుభూమికే రైతుబంధు ఇస్తామనడం సరికాదు

కాంగ్రెస్ ప్రభుత్వం సాగు భూమికే రైతుబంధు ఇస్తామనడం సరికాదు. గతంలో రైతులకు సీజన్ల వారీగా రైతుబంధు వచ్చేది. రైతుబంధు విషయంలో ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రులు పూటకో మాట మాట్లాడుతూ అయోమయానికి గురిచేస్తున్నారు. పంట పెట్టుబడి సాయంగా రైతుబంధు క్రమం తప్పకుండా వేయాలి. పూటకో మాట మాట్లాడి కాలయాపన చేయడం సమంజసం కాదు.

–కుర్వ ఈరప్ప, గోపాల్‌పూర్, పెద్దేముల్ మండలం, వికారాబాద్ జిల్లా



### కాంగ్రెస్ ఇబ్బంది పెడ్తున్నది

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు కావాల్సినంత కరెంట్ వస్తుండే. వానలు పడే సమయంలో, పంటలు వేసే ముందు రైతుబంధు కింద పంట పెట్టుబడి సాయం ఇస్తుండే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితి ఘోరంగా తయారైంది. పంట వేసినోళ్లకే రైతుబంధు ఇస్తమంటే , పంటలు పండని రైతుల పరిస్థితేంది. అందరికీ రైతుబంధు ఇవ్వాలి. ఎక్కడవడితే అక్కడ సీఎంతోపాటు మంత్రులు ఐదెకరాల వరకే రైతుబంధు ఇస్తామని చెబుతున్రు. గత ప్రభుత్వం అందరికీ ఎట్టిచ్చింది. ఈ ప్రభుత్వం ఎందుకిస్తలేదు. గెలిచినంక ఐదెకరాలని కొర్రీలు పెట్టుడు కరెక్ట కాదు.

–సాయిలు యాదవ్, కొల్లూర్, బాన్సువాడ మండలం,



## డ్యామ్ కమ్ బరాజ్‌లానే డిజైన్

- వినియోగంలో ఇబ్బందుల్లేవు
- జస్టిస్ ఘోష్‌కు వివరించిన రిటైర్డ్ ఈఎన్సీ వెంకటేశ్వర్లు

హైదరాబాద్, మే11 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో కీలక మేడిగడ్డ బరాజ్‌ను డ్యామ్ కమ్ బరాజ్‌లానే డిజైన్ చేశామని, నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని న్యాయవిచారణ కమిషన్ చైర్మన్, జస్టిస్ పీసీ ఘోష్‌కు రామగుండం ఇరిగేషన్ సర్కిల్ రిటైర్డ్ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన జస్టిస్ ఘోష్, సంబంధిత అధికారులతో వరుసగా భేటీ అవుతున్నారు. ప్రాజెక్టుపై సందేహాలు, సాంకేతిక వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా మూడో రోజు శనివారం రిటైర్డ్ ఈఎన్సీ వెంకటేశ్వర్లును పిలిపించుకొని పలు వివరాలు తెలుసుకున్నారు. బరాజ్ అని చెప్పి డ్యామ్‌లా నిర్మించారా? అది ముందే తెలుసా? దానివల్ల ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ఆరా తీసినట్లు తెలిసింది. మేడిగడ్డ బరాజ్‌ను డ్యామ్ కమ్ బరాజ్‌లానే డిజైన్ చేశామని, నిర్వహణలో ఎలాంటి ఇబ్బందీ ఉండబోదని రిటైర్డ్ ఈఎన్సీ వెల్లడించినట్టు సమాచారం. రెండు రోజులుగా రాష్ట్రంలో పర్యటించిన ఘోష్ శనివారం తిరిగి వెళ్లిపోయారు. మళ్లీ ఈ నెల 25, 26 తేదీల్లో వస్తానని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు చెప్పినట్టు తెలిసింది.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**భూపాలపల్లి జిల్లాలో విషాదం**



భాస్కర్‌రావు (ఫైల్)

టేకుమట్ల, మే 11 : అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం సుబ్బక్కపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మాదారపు భాస్కర్‌రావు (44)కు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఆశించిన స్థాయిలో పంటలు పండక సుమారు రూ.18 లక్షల అప్పు అయ్యింది. గ్రామంలో వ్యవసాయం చేస్తూ అప్పులు తీర్చడం సాధ్యంకాక హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలే తన స్వగ్రామం సుబ్బక్కపల్లికి వచ్చాడు. మళ్లీ హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పి శనివారం పొలానికి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించారు. మృతుని తల్లి వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.



### రైతుబంధు రాకపాయే

నాకు మా ఊళ్లో నాలుగెకరాలు ఉంది. యాసంగి పెట్టుబడి సాయం అందలేదు. గతేడాది కేసీఆర్ సర్కారు సమయానికి రైతుబంధు డబ్బులేసిన్రు. ఎకరానికి రూ. 5 వేల చొప్పున రూ. 20 వేలు ఖాతాల పడ్డయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక యాసంగి పెట్టుబడి ఇవ్వకపాయె. అప్పులు చేసి పంటలేసినం. రైతుబంధు వస్తుందనే నమ్మకం పోతున్నది. పంట సాగు చేసిన తర్వాత రైతుబంధు ఇస్తామని సీఎం రేవంత్ చెబుతున్నడు. పెట్టుబడి సాయం పంటలకు ముందిస్తేనే మేలైతది. లేదంటే వడ్డీలకు అప్పు తెచ్చుకోవాల్సి వస్తుంది. పంటలేసిన తర్వాత సర్వే చేసి పైసలిస్తరట. అప్పుచేసి పంటలేసిన తర్వాత రైతుబంధు ఇస్తే ఏం లాభం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను అరిగోస పెడ్తుంది.

– శంకర్, రైతు, పెంచికల్‌పేట్, కుమ్రంభీం ఆసిఫాబాద్



### పంట వేసేటప్పుడే ఇయ్యాలె

నాకు నాలుగెకరాల భూమి ఉంది. చిన్నప్పటి నుంచి వ్యవసాయం చేస్తున్న. రైతులకు మంచి చేసిన నాయకుడు ఎవరన్నా ఉన్నారంటే అది కేసీఆరే. రైతుల కష్టసుఖాలను ఎరిగి రైతుకు పెట్టుబడి సాయం చేసిండు. అది కూడా పంట వేసే ముందే ఇచ్చేది. పంట పెట్టుబడి కోసం షావుకారి దగ్గర అప్పు తెచ్చే బాధలు తప్పినయ్. పదేండ్లు ఎవుసం పండుగలా సాగింది. కాంగ్రెస్ సర్కారు వచ్చిన నాలుగు నెలలకే రైతులను ఆగం చేసింది. పెట్టుబడి సాయం టైంకు అందక తిప్పలు పడ్డ. అప్పులు వేవడంతో వడ్డీ మీద పడ్డది. యాసంగిలో నీళ్లు రాక పంట ఎండిపోయింది. రైతు గోసను రేవంత్ సర్కారు పట్టించుకోలేదు. యాసంగి పెట్టుబడి సాయాన్ని ఎలక్షన్ల నాలుగు రోజుల ముందు ఇవ్వటం ఓట్ల కోసం కాదా? రైతులను రాజకీయంగా వాడుకోవడం మంచి పద్ధతికాదు. రైతులను ఓట్లేసే యంత్రాల్లా చూస్తున్న కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్తం.

– మేకల వీరేశం, పెర్కపల్లి, సుల్తానాబాద్ మండలం, పెద్దపల్లి జిల్లా



### పెట్టుబడికి అప్పు తేవాల్సి వచ్చింది

నాకున్న మూడెకరాల్ల వరి పంట వేసిన. యాసంగి టైముకు రైతుబంధు డబ్బులు పడకపోవడంతో అప్పుతెచ్చి ఎరువులు, విత్తనాలుకొని నాటేసిన. ఆ తర్వాత ఇరవై రోజులకు రైతుబంధు డబ్బులు ఖాతాలో పడ్డయి. ఐదెకరాలున్న రైతులకు వరి పంట కోత అయి ధాన్యం అమ్మినంక నాలుగు రోజుల కింద డబ్బులు పడ్డయి. మూడు రోజుల్లో ఎలచ్చన్లు ఉన్నయని కాంగ్రెస్ సర్కారు ఈ రైతుబంధు యేసింది. ఎన్నికలు లేకుంటే ఐదెకరాలున్న రైతులకు వేసునో వేయకపోవునో. కేసీఆర్ సారు రైతుబంధు ఇవ్వలేని ప్రభుత్వాన్ని నిలదీయడం వల్లే అయింత డబ్బులు వేసింద్రు. గత ప్రభుత్వంలో సీజన్ ప్రారంభం ముందే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమయ్యేది. వానకాలం సీజన్ ఇరవై రోజుల్లో మొదలు కానుంది. ఇప్పుడైనా రైతుబంధు ముందే వేస్తే రైతులకు ఆసరాగా ఉంటది. లేదంటే పెట్టుబడుల కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల ఎంబడి తిరగక తప్పది.

– సుల్గూరి రమేశ్, రైతు, భీంపల్లి, కమలాపూర్, హనుమకొండ